సాక్షి
సూర్యాపేట
శనివారం । 9 । నవంబర్ । 2024



ఆరబెట్టిన కూరగాయలతో..
కూరగాయలను కట్‌చేసి ఆరబెట్టి మార్కెటింగ్ చేస్తూ అధిక ఆదాయం పొందుతున్నాడు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.
- 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	586.80 అడుగులు
ఇన్‌ఫ్లో	59,696 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	30,890 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	12,910 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	10,567 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	4,613 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	2,400
వరద కాల్వకు	400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	643.75 అడుగులు
ఇన్‌ఫ్లో	864.11 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	415.52 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	48 క్యూసెక్కులు
కుడికాల్వకు	నిల్

న్యూస్‌రీల్

నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి



అక్కలదేవిగూడెం గ్రామంలోని ఐకేపీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

చివ్వెంల(సూర్యాపేట): రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. శుక్రవారం చివ్వెంల మండలం అక్కలదేవిగూడెం గ్రామంలోని ఐకేపీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని, తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటా వేయాలని సూచించారు. తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. కేంద్రాల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా రైతుల నమోదు, గన్నీ బ్యాగుల రిజిస్టర్, ఏఈఓ ధ్రువీకరించిన తేమశాతం రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ క్రిష్ణయ్య, ఏపీఎం సైదయ్య, సీసీలు వెంకన్న, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి



టీకాల శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్

హుజూర్‌నగర్: పశువులకు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ దామచర్ల శ్రీనివాసరావు సూచించారు. జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హుజూర్‌నగర్‌లోని పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల వారీగా ఇంటింటికీ పశు వైద్య సిబ్బందిని పంపించి 2,148 పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించినట్లు తెలిపారు. పశువులకు టీకాలు వేయించనివారు శనివారం పశువైద్యశాలలోని సిబ్బందిని సంప్రదించి వేయించుకోలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, గాయత్రి భాస్కర్, పశువైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ తిరు, మాడ వీధుల్లో సేవను ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టించి ఊంజల్ సేవోత్సవం జరిపించారు. ఇక.. ఆలయంలో నిత్య పూజలు యథావిధిగా కొనసాగాయి.

మట్టపల్లి క్షేత్రానికి చేరిన మహాసంకల్పిత పాదయాత్ర



పూజల్లో పాల్గొన్న పాదయాత్ర బృందం

మఠంపల్లి: చెన్నైకి చెందిన స్వాతీనక్షత్ర మహాయజ్ఞ ట్రస్టు పీఠం ఆధ్వర్యంలో చేపట్టిన 25వ మహా సంకల్పిత పాదయాత్ర శుక్రవారం సాయంత్రం మట్టపల్లి క్షేత్రానికి చేరుకుంది. చెన్నై నుంచి వచ్చిన భక్తులతోపాటు నృసింహ, అయ్యప్ప మాలధారులు, ఇతర భక్తులు పాదయాత్రను కొనసాగించారు. రాత్రి మట్టపల్లి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్థానికంగా గల చెన్నై ముక్కూరుస్వామి ఆశ్రమానికి పీఠాన్ని చేర్చారు. అదేవిధంగా కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు సాయంత్రం కృష్ణానదిలో కార్తీక హారతి ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, ముక్కూరుస్వామి పీఠం చైర్మన్ శ్రీనివాసన్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, మంగాచార్యులు, లక్ష్మీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

బాధలు తెలుసుకుని.. భరోసా ఇచ్చి..

సీఎం రేవంత్‌రెడ్డి మూసీ పునరుజ్జీవ సంకల్ప యాత్ర



సంగెం వద్ద మూసీ నీటిని బాటిల్‌లో పడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి

- సంగెం నుంచి భీమలింగం కత్వ వరకు 5 కిలో మీటర్లు సాగిన పాదయాత్ర
- రైతులు, కులవృత్తిదారులతో మమేకం
- మూసీని పునరుజ్జీవం చేసి తీరుతామని హామీ
- యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిపైనా సమీక్ష
- పెండింగ్ పనులను పూర్తిచేస్తామని స్పష్టం



పాదయాత్ర చేస్తూ మూసీ నీటిని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, బాలూనాయక్, మల్‌రెడ్డి రంగారెడ్డి

సాక్షి, యాదాద్రి, వలిగొండ, భువనగిరి, రామన్నపేట : యాదాద్రి భువనగిరి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ఉత్సాహంగా సాగింది. దాదాపు ఏడు గంటల 38 నిమిషాల పాటు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. ఆ తర్వాత మూసీ పునరుజ్జీవ సంకల్ప యాత్ర చేపట్టారు. శుక్రవారం తన పుట్టిన రోజు సందర్భంగా ఉదయం హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం.. తొలుత శ్రీలక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ప్రెసిడెన్షియల్ సూట్‌లో వైటీడీఏ, దేవస్థానం, ఆర్‌అండ్‌బీ అధికారులతో సమావేశమై అభివృద్ధి పనులపై సమీక్షించారు. అలయ అభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. నివేదిక రూపొందించాలని ఆదేశించారు. ప్రత్యేకంగా తయారు చేసిన జ్ఞాపికను దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు ముఖ్యమంత్రికి అందజేశారు. ఆ తరువాత భువనగిరి నియోజకవర్గంలోని వలిగొండ మండలం సంగెం బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన సంగెం భీమలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించి మూసీ పునరుజ్జీవ సంకల్ప యాత్ర చేపట్టారు. సుమారు 5 కిలో మీటర్లు పాదయాత్ర కొనసాగింది. మూసీ కలుషిత నీటితో ఎదుర్కొంటున్న సమస్యలపై రైతులు, మత్స్యకారులు, గీత కార్మికులతో పాటు ఇతర వర్గాల ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మూసీపై బ్రిడ్జి, భీమలింగం కత్వ వద్ద వసతుల ఏర్పాటుకు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. పాదయాత్రలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మందుల సామేల్, వేముల వీరేశం, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాదయాత్రకు హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది.

మూసీ పునరుజ్జీవం ఆగదు
–మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

మూసీ పునరుజ్జీవంపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని, ఎవరు అడ్డుపడినా పునరుజ్జీవన కార్యక్రమం ఆగదని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మూసీ కాలుష్యంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, కొందరికి వికలత్వం సంభవిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటింటికీ నల్లాల ద్వారా నీరిస్తామని చెప్పి విస్మరించారని, ఇప్పుడు మాజీ మంత్రి కేటీఆర్ పాదయాత్ర చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మూసీ ప్రక్షాళన చేస్తామని గొప్పలు పలికి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ధృడ సంకల్పంతో ఉన్నారని, ఎవరైనా అడ్డు వస్తే మూసీ పరీవాహక ప్రాంత ప్రజలే ముక్కలు ముక్కలు చేస్తారని హెచ్చరించారు.

ప్రజల కష్టాలు తీరుస్తాం
–మంత్రి పొన్నం ప్రభాకర్

మూసీ కలుషిత జలాలతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వారి కష్టాలు తీర్చడమే లక్ష్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజల కష్టాలు తీర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మూసీ పునరుజ్జీవం చేసేందుకు ధృడ సంకల్పంతో ముందుకు సాగుతున్నారని, ఎవరు అడ్డొచ్చిన కార్యక్రమం ఆగదన్నారు. గత ప్రభుత్వం మూసీ పునరుజ్జీవం ఎందుకు చేయలేదో సమాధానం చెప్పాలన్నారు.

పదేళ్లలో చేయని పని.. పది నెలల్లోనే
–ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

గత ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి మూసీని పట్టించుకోలేదని, సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే మూసీ పునరుజ్జీవం కోసం చర్యలు చేపట్టారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో మూసీ అంశం చేర్చకపోయినా ప్రజల కష్టాలు తెలుసుకుని నదిని పునరుజ్జీవం చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి తీరుతామన్నారు.



మూసీ నీటిని పరిశీలించి స్థానికుడితో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

రైతులు, కులవృత్తుల శ్రేయస్సే ధ్యేయం
– ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

రైతులు, కులవృత్తుల శ్రేయస్సే ధ్యేయమని, అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి మూసీ పునరుజ్జీవం చేస్తున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మూసీ పునరుజ్జీవం కార్యక్రమాన్ని చేపట్టగానే ప్రతిపక్ష పార్టీలోని బావ, బావమరిది విమర్శలు చేస్తున్నారని, ప్రజలే వారికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

కేటీఆర్, హరీష్‌రావుకు కలుషిత నీరు తాగితే తెలుస్తుంది
–ఎమ్మెల్యే మందుల సామేల్

కేటీఆర్, హరీష్‌రావులకు మూసీ నీరు తాగితే గానీ ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలియవని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి మూసీ పునరుజ్జీవం చేయడానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రజల తరఫున సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు మేలు
–ఎమ్మెల్యే వేముల వీరేశం

మూసీ పునరుజ్జీవంతో ఉమ్మడి నల్లగొండకు మేలు జరుగుతుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో 80శాతం రైతులు మూసీ నీటిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు మూసీ పునరుజ్జీవాన్ని అడ్డుకోవాలని కుట్ర చేయడం దారుణమన్నారు. మూసీ పరీవాహక ప్రాంత ప్రజల దశాబ్దాల కల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాకారం కాబోతుందన్నారు.

సీఎం పర్యటన సాగిందిలా..

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఉదయం 11.02 గంటలకు హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు చేరుకున్నారు. హెలికాప్టర్‌లో నుంచే యాదాద్రి ఆలయ పరిసరాలను పరిశీలించారు.
- 11.05కు యాదాద్రి కొండ దిగువన ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో దిగారు.
- 11.20కి కాన్వాయ్‌లో ప్రెసిడెన్షియల్ సూట్‌కు వెళ్లారు.
- 11.31కి ప్రెసిడెన్షియల్ సూట్‌నుంచి కాన్వాయ్‌లో బయలుదేరి 11.40కి యాదాద్రి కొండపైకి చేరుకున్నారు.
- 11.43కు విష్ణు పుష్కరిణిలో స్నాన సంకల్ప పూజ, అనంతరం అఖండ దీపారాధనలో పాల్గొన్నారు.
- 11.56కు త్రితల రాజగోపురం వద్దకు చేరుకున్నారు. అక్కడ అర్చకులు బంగారు కలశంతో సీఎంకు పూర్ణకుంభ స్వాగతం పలికారు.
- 11.59కి క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం గర్భాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, ఆండాళ్ అమ్మవారిని, ఆళ్వారులను దర్శించుకుని ధ్వజ స్తంభాన్ని మొక్కారు.
- 12.06 నుంచి 12.20 వరకు గర్భాలయంలోకి స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- 12.23 నుంచి12.34 వరకు ఆలయంలోని వివిధ విభాగాల్లో గడిపారు.
- 12.46కు ప్రెసిడెన్షియల్ సూట్ చేరుకున్నారు.
- 12.56 నుంచి 2.36 వరకు ప్రెసిడెన్షియల్ సూట్‌లో వైటీడీఏ, దేవస్థానం, ఆర్‌అండ్‌బీ, దేవాదాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.
- 2.50కి ప్రెసిడెన్షియల్ సూట్ నుంచి ప్రత్యేక బస్సులో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలతో బయలుదేరి 3.30కి సంగెం బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు.
- 4.05కు బ్రిడ్జి వద్ద శివలింగానికి పూజలు చేసి మత్స్యకారుడితో మాట్లాడారు. అనంతరం నదిలో స్పీడ్ బోటులో ప్రయాణించి నీటిని పరిశీలించారు.
- 4.30కి సంగెం బ్రిడ్జి పైనుంచి భీమలింగం కత్వ వరకు పాదయాత్ర చేశారు. తిరిగి అక్కడి నుంచి పాదయాత్రగా 5:15కు సభా వేదిక వద్దకు చేరుకున్నారు.
- 6:05 నుంచి 6.30 వరకు ప్రజలనుద్దేశించి సీఎం ప్రసగించారు.
- 6:40కి హైదరాబాద్‌కు రోడ్డుమార్గంలో బయలుదేరి వెళ్లారు.

కమీషన్ల కోసమే కాళేశ్వరం
– ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని, మూసీ పునరుజ్జీవం చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు తీసుకుని మూసీ పరీవాహక ప్రాంత ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి వచ్చారని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవంపై బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ఎవరెన్ని కుట్రలు పన్నినా పునరుజ్జీవం చేసి తీరుతామన్నారు. మూసీ వంతెన కుంగిపోతుందని, కొత్త వంతెనకు నిధులు మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఎమ్మెల్యే కోరారు.



సీఎంకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకుడు, చిత్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ



వలిగొండ మండలం సంగెం వద్ద మూసీ బ్రిడ్జిపై పాదయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు

వృత్తిదారులతో సీఎం సంభాషణ

ముఖ్యమంత్రి : మూసీ నీటిని శుద్ధి చేస్తే ఎలా ఉంటుంది?

చెక్క నర్సింహ్మ(మత్స్యకార్మికుడు): సార్ మేము చేపలు పట్టే వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాం. మురుగు నీటిలో ఉన్న చేపలను వినియోగదారులు కొనలేకపోతున్నారు. దీంతో మేము జీవనాధారం కోల్పోవాల్సి వస్తుంది.

ముఖ్యమంత్రి : చెరువుల్లో నీరు మూసీ నీటితోనే నిండి ఉన్నాయా?

చెక్క నర్సింహ: చెరువులు కబ్జాకు గురవుతున్నాయి. ఉన్న కొద్దిపాటి నీటిలో కూడా చేపలు బతకడం లేదు. మూసీని శుద్ధి చేయాలి సార్.

ముఖ్యమంత్రి : మూసీ నీటితో చేపలు బతుకుతున్నాయా?

చెక్క గోపాల్(మత్స్యకార్మికుడు): వర్షాలు వచ్చే సీజన్‌లో మూసీ నీరు విపరీతమైన కలుషీతంతో ప్రవహిస్తుంది. ఈ సమయంలో నీటిలో చేపలు చనిపోతాయి. ఇక్కడ పట్టిన చేపలు అంతగా తినడానికి ఇష్టపడారు. కొన్ని సందర్భాలలో చేపలు పట్టే వృత్తి వదిలి కూలి పనులకు పోవాల్సి వస్తుంది సార్.

నృసింహుడికి సీఎం పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉదయం ప్రెసిడెన్షియల్ సూట్‌కు వెళ్లి.. సంప్రదాయ దుస్తులు ధరించి కొండపైకి చేరుకున్నారు. విష్ణు పుష్కరిణిలో స్నాన సంకల్ప పూజ, ఆలయ మాడ వీధిలో ఏర్పాటు చేసిన అఖండ దీపారాధన వద్ద పూజలు చేశారు. త్రితల రాజగోపురం వద్ద సీఎంకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం సీఎంకు అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి ప్రసాదం ఇచ్చారు. సీఎంకు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ స్వామివారి చిత్రపటం అందజేశారు. సీఎం వెంట మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, బాలునాయక్ తదితరులు ఉన్నారు.

సర్వేలో ఎన్యుమరేటర్ల పాత్ర చాలా కీలకం

- జిల్లా ప్రత్యేకాధికారి అనితారామచంద్రన్

భానుపురి (సూర్యాపేట): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్ల పాత్ర చాలా కీలకమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ కమిషనర్, సూర్యాపేట జిల్లా ప్రత్యేక అధికారి అనితారామచంద్రన్ అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే, ధాన్యం కొనుగోళ్లపై శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్యుమరేటర్లు తప్పులు లేకుండా కుటుంబాల వివరాలు సేకరించాలని, ఆ వివరాలను డాటా ఎంట్రీ ఆపరేటర్లు చాలా జాగ్రత్తగా కంప్యూటర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. డాటా ఎంట్రీ జరిగే దగ్గర సెంటర్ ఇన్‌చార్జిని నియమించాలన్నారు. సర్వేలో ఏమైనా సందేహాలు ఉంటే పైఅధికారులను అడిగి నివృత్తి చేసుకొని ఇచ్చిన ఫారాల్లో సమాచారాన్ని పొందుపరచాలని సూచించారు. కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలో 3,64,832 ఇళ్ల జాబితాను రూపొందించామన్నారు. 310 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 18.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు డీఎస్‌ఓ డి.రాజేశ్వర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు, డీఆర్‌డీఓ వి.అప్పారావు, సీపీఓ ఎల్.కిషన్, ఆర్డీఓలు ఆర్.వేణుమాధవరావు, సూర్యనారాయణ, వి.శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్, సీహెచ్.రమాదేవి, రామదుర్గారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ శిరీష, డీసీఓ పద్మజ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ నాయక్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, డీఈఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనితారామచంద్రన్



సమావేశానికి హాజరైన అధికారులు, సిబ్బంది

మత్తు పదార్థాలను నిరోధించాలి



సదస్సులో మాట్లాడుతున్న శ్రీవాణి

పెన్‌పహాడ్: మత్తు పదార్థాలు పాఠశాలలకు రాకుండా నిరోధించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సూర్యాపేట కోర్టు సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి అన్నారు. పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్ గ్రామంలోని జంగంపడిగ కాలనీలో శుక్రవారం న్యాయ సేవాధికార సంస్థ, అభిన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలతో ముచ్చటించారు. సదస్సులో బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డప్పు మల్లయ్య, నోడల్ అధికారి వస్రాంనాయక్, హెచ్‌ఎంలు వెంకన్న, మల్లారెడ్డి, పర్యవేక్షణాధికారి పద్మజ, సీఆర్పీ మామిడి సైదయ్య, పాఠశాల చైర్మన్ రేణుక పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రలను తిప్పికొట్టాలి

- కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ

భానుపురి (సూర్యాపేట): దేశంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ పేరుతో పాలనవైపు తీసుకెళ్తూ రాజ్యాంగాన్ని మార్చాలన్న మోదీ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ అన్నారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కోట గోపి, ఆఫీస్ బేరర్లు బొడ్డుపల్లి వెంకటరమణ, నందిగామ సైదులు, దేవరకొండ యాదగిరి, టేకుల సుధాకర్, దుర్గారావు రమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

రుణమాఫీ అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

నడిగూడెం: రైతు రుణమాఫీ అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి ఆరోపించారు. శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ మండల 8వ మహాసభలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, రైతు భరోసా నిధులు విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించాయని విమర్శించారు. ఈ సభలో నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మట్టిపల్లి సైదులు, దండా వెంకట్‌రెడ్డి, బెల్లంకొండ వెంకట్‌రెడ్డి, జె.నర్సింహారావు, బెల్లంకొండ సత్యనారాయణ, కొరట్ల శ్రీనివాస్, ఏనుగుల వీరాంజనేయులు, లతీఫ్‌బాబు, మల్లెల వెంకన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వృద్ధుడు మృతి


వృద్ధుడి మృతదేహం

మిర్యాలగూడ అర్బన్ : గుర్తు తెలియని వృద్ధుడు మిర్యాలగూడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై మృతి చెందాడు. రైల్వే ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 70 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధుడు మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారం వన్‌పై మృతి చెంది ఉండగా గుర్తించామని తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని కోరారు.

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

నల్లగొండ క్రైం: కులాంతర వివాహం చేసుకున్న యువతిని ఆమె బంధువులు శుక్రవారం కిడ్నాప్ చేసి తీసుకెళ్లిన ఘటనలో ఐదుగురు నిందితులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. పెద్దవూర మండలం గర్నెకుంట గ్రామానికి చెందిన భూతం హరిప్రసాద్.. నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన కొరదల రాజేశ్వరిని గత నెల 26న నల్లగొండలో కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో కాకతీయ డిగ్రీ కాలేజీలో రాజేశ్వరితో కలిసి సర్టిఫికెట్లు తీసుకోవడానికి వెళ్లగా యువతి తల్లిదండ్రులు శోభ, యాదయ్య, బంధువులు స్వరూపరాణి, దసరమ్మ, ఇద్దయ్యలు యువకుడి కంట్లో కారం చల్లి రాజేశ్వరిని బలవంతంగా కారులో తీసుకెళ్లారు. దీంతో హరిప్రసాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు యువతిని, ఆమె బంధువులను ఓ గ్రామంలో ఉండగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకొచ్చారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ డానియల్, ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

డిండి ప్రాజెక్టులో దూకి బ్యాంక్ మేనేజర్ ఆత్మహత్య


సయ్యద్ ఖాదర్ పాషా(ఫైల్)

డిండి : డిండి ప్రాజెక్టులో దూకి ఓ బ్యాంక్ మేనేజర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారంం దేవరకొండ పట్టణానికి చెందిన సయ్యద్ ఖాదర్‌పాషా(48) డిండి మండల కేంద్రంలోని ఎన్డీసీసీ బ్యాంక్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని నెలల నుంచి అనారోగ్య సమస్యతో ఖాదర్‌పాషా ఇబ్బందులు పడుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం భోజనం కోసం బ్యాంకు నుంచి బయటికి వచ్చాడు. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో బ్యాంక్ సిబ్బంది వెతకగా అతడికి సంబంధించిన ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్, కళ్లజోడు ప్రాజెక్టు వద్ద కనిపించాయి. బ్యాంకు సిబ్బంది ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మత్స్యకారుల చేత ప్రాజెక్టులో వెతికించడగా.. ఖాదర్‌పాషా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టర్ నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఖాదర్‌పాషా సోదరుడు సయ్యద్ అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. ఖాదర్‌పాషాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

పెన్‌పహాడ్ : అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని అన్నారం బ్రిడ్జి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్టేషన్ హౌజ్ ఆఫీసర్ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారం బ్రిడ్జి గ్రామానికి చెందిన కల్లెం సుధాకర్(20) గురువారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నుంచి బైక్‌పై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి కోసం వెతకగా సాగర్ ఎడమ కాల్వ కట్టపై సుధాకర్‌కు చెందిన బైక్, సెల్, చెప్పులు లభించాయి. అనుమానంతో సాగర్ కాల్వలో అతడి సోదరుడు నాగరాజు వెతకగా గరిడేపల్లి మండలం అగ్రహారం రిజర్వాయర్‌లో సుధాకర్ మృతదేహం లభ్యమైందని తెలిపారు. మృతుడి సోదరుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


వలిగొండ మండలం సంగెం వద్ద మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి


మాట్లాడుతున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి


మూసీ నదిలో పసుపు కుంకుమతో పూజలు చేస్తున్న సీఎం


భీమలింగం వద్ద నంది నుంచి శివుడిని చూస్తున్న సీఎం


శివలింగానికి అభిషేకం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి


మాట్లాడుతున్న వృత్తిదారుడు కుమ్మరి వెంకటేష్


పాదయాత్రలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు


సీఎంకు వినతి పత్రం ఇస్తున్న నారి ఐలయ్య

మూసీ నీళ్లు తాగేవాళ్లం

నా చిన్నతనంలో నాన్నతో కలిసి గొర్లు కాయడానికి వెళ్లి మూసీ నీళ్లు తాగేవాళ్లం. ఇప్పుడు మూసీ పూర్తిగా కలుషితమైంది. ఇక్కడ పండించిన వడ్లను కొనాలంటే వెనుకడుగు వేస్తున్నారు. ఇక్కడివాళ్లకు పిల్లను ఇవ్వాలన్నా బయపడుతున్నారు. 30 ఏళ్లకే 60 ఏళ్ల వ్యక్తుల్లా మారిపోతున్నారు. మూసీ పునరుజ్జీవం కార్యక్రమానికి సీపీఎం మద్దతు ఇస్తుంది.

–నారి అయిలయ్య, సీపీఎం నాయకుడు


విష్ణుపుష్కరిణిలో నీటిని తలపై చల్లుకుంటున్న సీఎం


ధ్వజస్తంభానికి మొక్కుతున్న సీఎం

ముఖ్యమంత్రి పర్యటన సైడ్‌లైట్స్

- భీమలింగం కత్వ వద్ద శివలింగానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు రామాంజనేయ శేషాద్రి, మణికంఠశర్మలు సీఎంకు అర్చన చేశారు.
- ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బోటులో ముఖ్యమంత్రి ఐదు నిమిషాల పాటు నదిలో ప్రయాణం చేసి నీటిని పరిశీలించారు.
- పాదయాత్రలో మత్స్యకార్మికులు చెక్క యాదగిరి, నర్సింహ, మాదగోని శ్రీను, ముత్యాలు, చెక్క గోపాల్, శ్రీరాం పెంటయ్యతో సీఎం ముచ్చటించారు. మూసీలో చేపలు బతుకుతున్నాయా.. మూసీ నీటి శుద్ధి చేస్తే ఎలా ఉంటుందని అడిగారు.
- రేవంత్‌రెడ్డిపై నల్లగొండ గద్దర్ (నర్సిరెడ్డి) కొత్తగా పాడిన పాట సీడీని సంగెం వద్ద సభా వేదికపై సీఎం విడుదల చేశారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి నూతన పాట పాడగా సభికులు కేరింతలు కొట్టారు.
- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మూసీ నదిపై రాసిన పాటల సీడీ, పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు.
- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తెలంగాణ యాసలో సభలో మాట్లాడి ఆకట్టుకున్నారు. అతను మాట్లాడినంత సేపు ప్రజలు ఈలలు, చప్పట్లతో హోరెత్తించారు.
- ఎమ్మెల్యే సామేల్ తన ప్రసంగంలో ఎనిమిది సార్లు ముఖ్యమంత్రికి శిరస్సువంచి నమస్కరిస్తున్నా అని సంబోధించారు.
- భీమలింగం వరకు రోడ్డు నిర్మాణం, పరిసరాల అభివృద్ధికి తక్షణమే రూ.2కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించడంతో ఆ ప్రాంత వాసులు కేరింతలు కొట్టారు.
- మూసీ పునరుజ్జీవన యాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సన్మానించేందుకు పార్టీ నాయకులు, యువకులు, ఎగబడ్డారు.
- భీమలింగం కత్వ వద్ద శివలింగానికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లింగాన్ని అలింగనం చేసుకున్నారు.

భారీ పోలీస్ బందో బస్తు


గుర్రాలపై వస్తున్న పోలీసులు

భువనగిరి : వలిగొండ మండలం సంగెం గ్రామ పరిధిలోని భీమలింగం కత్వ వద్ద శుక్రవారం మూసీ పునరుజ్జీవన యాత్రలో భాగంగా ముఖ్యమంత్రి చేపట్టిన పాదయాత్ర సందర్భంగా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక బస్సులో భువనగిరి నుంచి అనాజీపురం నందనం, నాగిరెడ్డిపల్లి, బొల్లేపల్లి గ్రామాల మీదుగా వెళ్లారు. ఈ సందర్భంగా రోడ్డు వెంట అడుగడుగునా పోలీస్‌ను బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటలను జరగకుండా సీపీ సుధీర్‌బాబు, డీసీపీ రాజేష్‌చంద్ర చర్యలు తీసుకున్నారు. బొల్లేపల్లి నుంచి సంగెం గ్రామానికి వెళ్లే మార్గంలో కత్వాకు కొద్ది దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను అక్కడే పార్కింగ్ చేయించారు. అలాగే సంగెం గ్రామం నుంచి కత్వాకు వెళ్లే మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. సుమారు 1500 మంది సివిల్ పోలీసులతోపాటు అగ్నిమాపక సిబ్బంది, ప్రత్యేక పోలీస్ బలగాలు విధుల్లో పాల్గొన్నారు. వీరితోపాటు 30 మంతి మత్స్యకార్మికులు, 85 మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట : సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పా టు చేశారు. నలుగురు డీఎస్పీలు, నలుగురు అడిషనల్ డీఎస్పీలు, ఆరుగురు ఏసీపీలు 25 మంది సీఐలు, 40 మంది ఎస్‌ఐలు, ఒక ట్రాఫిక్ డీసీపీతో పాటు మరో 400 మంది పోలీస్ సిబ్బంది, 50 మంది ట్రాఫిక్ పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. యాదాద్రి కొండ పైన, ప్రెసిడెన్షియల్ సూట్, హెలీపాడ్, యాదగిరిగుట్ట నుంచి రాయగిరికి వెళ్లే మార్గంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు.

రెండు గంటలకు పైగా దర్శనాలు బంద్


కొండ కింద నిరీక్షిస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు శుక్రవారం యాదాద్రీశుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం 10.40 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తులకు దర్శనాలు నిలివేశారు. ఒంటి గంటకు ఆరగింపు పూర్తయిన తరువాత దర్శనాలకు అనుమతించారు. ఇదిలా ఉండగా కొండపైకి ఉదయం నుంచే భక్తుల వాహనాలను నిలిపివేశారు. మీడియా, ఆలయ అధికారులు, అర్చకుల వాహనాలను మొదటి ఘాట్ రోడ్డు నుంచి హరిత టూరిజం హోటల్ వరకు మాత్రమే అనుమతించారు. అక్కడి నుంచి కొండపైకి కాలినడకన వెళ్లారు. ఇక మూడవ ఘాట్ రోడ్డులో ఉదయం నుంచి మధ్యాహ్నం 12.50 వరకు వాహనాలను పూర్తిగా నిలిపివేశారు. ఆర్టీసీ బస్సుల ద్వారానే భక్తులను కొండపైకి వెళ్లేవిధంగా పోలీసులు చర్యలు చేపట్టారు.

భక్తుల ఇబ్బందులు

యాదగిరిగుట్ట రూరల్ : సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి పర్యటన సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. ఆలయంలో సీఎం పూజలు చేసి వెళ్లేంత వరకు రెండు గంటలపాటు దర్శనాలు నిలిపివేశారు. అప్పటివరకు భక్తులను అనుమతించకపోవడంతో కొండ కింద నిరీక్షించారు. సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించడానికి వచ్చిన భక్తులు కాలినడకన వ్రత మండపానికి వెళ్లాల్సి వచ్చింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


జోగయ్య(ఫైల్)


మృతి చెందిన బహదూర్

కేతేపల్లి: మండల కేంద్రంలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లికి చెందిన మట్టి జోగయ్య(49) గృహ నిర్మాణ కార్మికుడిగా (సుతారి మేస్త్రి) పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజువారి మాదిరిగానే శుక్రవారం జోగయ్య పని చేసేందుకు తన బైక్‌పై నకిరేకల్‌కు బయలుదేరాడు. ఈక్రమంలో కేతేపల్లిలోని పాత పోలీస్‌స్టేషన్ సమీపంలోకి రాగానే విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ అతి వేగంగా వచ్చి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి కింద పడిపోయిన జోగయ్యపైకి లారీ ఎక్కడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కేతేపల్లి పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ తెలిపారు.

రెండు వాహనాలు ఢీకొని..

త్రిపురారం : ప్రమాదవశాత్తు రెండు వాహనాలు ఢీకొని నేపాల్ గూర్ఖా మృతి చెందాడు. ఈ సంఘటన త్రిపురారం మండల కేంద్రంలో సాగర్ రోడ్డుపై శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన భవానీ నిలయం బహదూర్ (50) పదేళ్లుగా హాలియాలోని రెడ్డి కాలనీలో నివాసం ఉంటూ హాలియా పట్టణంలో రాత్రి సమయంలో గూర్ఖాగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం త్రిపురారం మండలంలో తన బంధువులను చూడడానికి టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై హాలియా నుంచి త్రిపురారం వైపు వస్తున్నాడు. త్రిపురారం మండల కేంద్రంలో శాంతినికేతన్ కళాశాల సమీపంలోకి రాగానే అదే సమయంలో గొర్రెల గుంపు రోడ్డు పైకి అడ్డంగా రావడంతో ఓ పక్కకు వచ్చాడు. అదే సమయంలో మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాసనగర్ సమీపంలో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో పెళ్లికి వచ్చినవారిని తీసుకుని హాలియాకు వెళ్తున్న మహింద్ర జెల్ వాహనం వేగంగా వచ్చి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై వస్తున్న బహదూర్‌ను ఢీకొట్టింది. దీంతో భవానీ నిలయం బహదూర్ అక్కడికక్కడే మృతి చెందాడు. త్రిపురారం పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బహదూర్‌కు భార్య, ఆరుగురు కూతుర్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడికి సంబంధించినవారు ఫిర్యాదు చేయలేదని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వై ప్రసాద్ తెలిపారు.

పాముకాటుతో వృద్ధురాలు మృతి

మోత్కూర్ : పాముకాటుతో వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు.. మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని అంగడి బజార్‌కు చెందిన వృద్ధురాలు పానుపాటి దుర్గమ్మ (60)శుక్రవారం సాయంత్రం బయటకు వెళ్లి ఇంటికి వచ్చి తాళం తీస్తుండగా కాలుకు ఏదో కరిచినట్టు అనిపించింది. భయపడిన దుర్గమ్మ వెంటనే కేకలు వేస్తూ బయటకు వచ్చింది. చుట్టుపక్కల ఉన్న కొందరు యువకులు ఇంట్లోకి వెళ్లి చూడగా రక్త పెంజర పాము కనిపించింది. భయంతో కుప్పకూలిన దుర్గమ్మ అక్కడికక్కడే చనిపోయింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హెడ్ కానిస్టేబుల్ నర్సింహ, రైటర్ ఖదీర్, కానిస్టేబుళ్లు రామనర్సింహ, రామారావు, ప్రవీణ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పాము కనిపించడంతో కొట్టి చంపారు. మృతురాలికి ఒక కూతురు ఉన్నారు. శవాన్ని పోస్టుమార్టం కోసం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

బంధువు అంత్యక్రియల్లో పాల్గొని..

కనగల్ : మండల పరిధిలోని పర్వతగిరి గ్రామంలో శుక్రవారం సాయంత్రం తమ బంధువు అంత్యక్రియలకు హాజరైన ఒక వ్యక్తి నీటిలో స్నానం చేస్తూ దుర్మరణం పాలయ్యాడు. కనగల్ ఎస్‌ఐ పి.విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. పర్వతగిరి గ్రామానికి చెందిన నల్లబోతు లింగయ్య(68) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా శుక్రవారం సాయంత్రం జరిగిన అతడి అంత్యక్రియలకు పలువురు బంధువులు హాజరయ్యారు. ఇందులో ఇదేగ్రామానికి చెందిన లింగయ్యకు సమీప బంధువైన నల్లబోతు పెంటయ్య(46) కూడా ఉన్నాడు. అంత్యక్రియలు ముగిసిన తర్వాత బంధువులందరూ కనగల్ వాగు బ్రిడ్జి కింద స్నానాల కోసం దిగారు. ఈ క్రమంలో స్నానం చేస్తూ పెంటయ్య ఇసుక క్వారీ నీటిమడుగులో ప్రమాదవశాత్తు మునిగి ఊపిరాడక మృతి చెందాడు. గమనించిన అక్కడ ఉన్న బంధువులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పెంటయ్య మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడు పెంటయ్యకు భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

ప్రజాప్రతినిధులను అడ్డుకున్న పోలీసులు


తూర్పు రాజగోపురం గేట్ నుంచి ఆలయంలోకి వెళ్లేందుకు యత్నిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

యాదగిరిగుట్ట: సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన సమయంలో ఆలేరు నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారని ఉదయమే మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చైతన్యరెడ్డి, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్ కొండపైకి చేరుకున్నారు. సుమారు 11.50 గంటల సమయంలో సీఎం మాడ వీధిలోకి వస్తున్న క్రమంలో స్వాగతం పలికేందుకు వెళ్తున్న వీరిని పోలీసులు అడ్డుకున్నారు. విప్ బీర్ల ఐలయ్య, స్థానిక సీఐ రమేష్ జోక్యం చేసుకుని వారిని సీఎం వద్దకు తీసుకెళ్లారు.

కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు శుక్రవారం వచ్చిన సమయంలో యాదాద్రి కొండపై భద్రతా వైఫల్యం స్పష్టంగా కనిపించింది. సీఎం రేవంత్‌రెడ్డి విష్ణు పుష్కరిణిలో స్నాన సంకల్ప పూజ చేసి, మాడ వీధిలో అఖండ దీపారాధనకు వచ్చారు. అప్పటికే ఉత్తర మాడ వీధికి ఆలేరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. రేవంత్‌రెడ్డి అఖండ దీపారాధన పూజలో పాల్గొనే సమయంలో, దీపారాధన నుంచి తూర్పు రాజగోపురం ముందుకు వెళ్లే సమయంలో, తూర్పు పంచతల రాజగోపురం వద్ద గేట్ నుంచి లోపలికి వెళ్తున్న క్రమంలో కాంగ్రెస్ నాయకులు.. పోలీసులను తప్పించుకుని పరుగులు తీస్తూ అక్కడికి వెళ్లారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఆ సమయంలో పోలీసులకు, కాంగ్రెస్ నేతలకు మధ్య తీవ్ర తోపులాట, వాగ్వాదం జరిగింది. అక్కడే ఉన్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పోలీసులు, కాంగ్రెస్ నేతల మధ్యలో ఇరుక్కుపోయింది. సీఎం రేవంత్‌రెడ్డి త్రితల రాజగోపురం వద్దకు వెళ్లిన తరువాత పోలీసులు కాంగ్రెస్ నేతలను పక్కకు నెట్టి మంత్రి కొండా సురేఖను ఆలయంలోకి పంపించారు. అనంతరం పోలీసులు తూర్పు రాజగోపురం గేట్‌లను మూసివేసి, కాంగ్రెస్ నేతలను అక్కడి నుంచి పంపించారు.

మాజీ జెడ్పీటీసీ సైదులుగౌడ్ రిమాండ్


సైదులును రిమాండ్ చేస్తున్న పోలీసులు

తిప్పర్తి : మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్‌ను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు తిప్పర్తి ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపారు. వివరాలు.. తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్ 2020 జూలై నెల 14న భూ వివాదంలో రేగట్టె నవీన్‌రెడ్డిని తుపాకితో బెదిరించాడని కేసు నమోదయింది. ఆ కేసు కోర్టులో కొనసాగుతోంది. అయితే కేసుకు సంబంధించిన కొన్ని వాయిదాలకు సైదులుగౌడ్ కోర్టుకు హాజరు కాలేదు. అదేవిధంగా ఈ నెల 6న వాయిదాకు హాజరు కాకపోవడంతో 7న మొబైల్ కోర్టు నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. దీంతో సైదులుగౌడ్‌ను శుక్రవారం కోర్టులో హాజరు పరుచగా మొబైల్ కోర్టు జడ్జి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

కోర్టు ఆదేశాలతోనే రిమాండ్..

నల్లగొండ క్రైం: తిప్పర్తి మండలానికి చెందిన మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్‌ను కోర్టు వాయిదాలకు హాజరు కానందున కోర్టు ఆదేశాల మేరకే రిమాండ్ చేసినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి శుక్రవారం తెలిపారు. 2020లో రేగట్టె నవీన్‌రెడ్డిని భూ తగాదాల విషయంలో పిస్తోలుతో బెదిరించడంతో తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవడంతో స్పెషల్ మొబైల్ కోర్టు ఈ నెల 7న సైదులుపై నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేసిందన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ చేస్తుండగా విద్యుదాఘాతం.. హెల్పర్ దుర్మరణం


ట్రాన్స్‌ఫార్మర్‌ను రిపేర్ చేస్తుండగా మృతిచెందిన వెంకట్‌రెడ్డి

వేములపల్లి : ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ చేస్తుండగా హెల్పర్ మృతిచెందిన సంఘటన వేములపల్లి మండలంలోని బుగ్గబావిగూడెం గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. బుగ్గబావిగూడెం గ్రామానికి చెందిన అమ్మిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ భూమిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో అదే గ్రామానికి చెందిన ప్రైవేట్ గ్రామీణ హెల్పర్ మోదుగు వెంకట్‌రెడ్డి(45) మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సమీపంలోని అదే లైన్‌పై మరో రైతు అక్రమ కనెక్షన్ ద్వారా విద్యుత్ వినియోగిస్తుండడంతో విద్యుత్ రివర్స్ సప్లయ్ కావడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, భార్య ఉన్నారు. ప్రమాదంపై అనుమానం ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశామని వేములపల్లి పోలీసులు పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పది మందికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులు

పెన్‌పహాడ్ : రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన పెన్‌పహాడ్ మండల కేంద్రం శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. స్టేషన్ హౌజ్ ఆఫీసర్ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలంలోని యల్లప్పకుంట తండా ప్రాథమిక పాఠశాలలో మసూద్, మండల పరిధిలోని లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంజూర్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో సూర్యాపేట నుంచి ఒకే బైక్ పాఠశాలలకు వెళ్తున్న సమయంలో మండల కేంద్రానికి చెందిన సురుగు సైదులు టీవీఎస్ మోపెడ్‌పై వస్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సూర్యాపేటలోని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఆటోలు ఢీకొని ఐదుగురికి..

రామన్నపేట : ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొని ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం నీర్నెముల గ్రామ శివారులో జరిగింది. వివరాలు.. లక్ష్మాపురం నుంచి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో నీర్నెముల శివారులోని మూలమలుపు వద్దకు రాగానే రామన్నపేట నుంచి వస్తున్న ట్రాలీ ఆటో ఒకదానికొకటి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఏబూషి యాదయ్య, సూరి రాకేష్, మెండె మల్లయ్య, బజ్జూరి సురేష్, గోర్ల నరేష్‌లకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 ఈఎంటీ మల్లేష్, పైలెట్ జి.పరమేష్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ..

కేతేపల్లి: బైక్‌ను లారీ ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన 65వ నంబర్ జాతీయ రహదారిపై కేతేపల్లిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన చిత్తలూరి ఎల్లెగౌడ, నర్సింగ్ సాయి శుక్రవారం ఇదే మండలంలోని కొప్పోలు గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగిన వివాహానికి బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కేతేపల్లిలోని బస్‌స్టేజీ సమీపంలోకి చేరుకోగానే విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ.. బైక్‌ను వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఎల్లెగౌడ, సాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అందించిన తర్వాత పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సాయిని హైదరాబాద్‌కు, ఎల్లెగౌడను నల్లగొండకు తరలించారు.